క్లుప్తంగా

5 నుంచి ఇంటర్వ్యూలు

బిజినేపల్లి: రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తుదారులందరికి అన్ని బ్యాంకులు, కార్పొరేషన్ల వారీగా సోమవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కథలప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీలకు మే 5న బిజినేపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు వారు, మే 6న బిజినేపల్లి ఎస్బీఐ, 7న పాలెం యూబీఐ బ్యాంకు, 8న వట్టెం ఎస్బీఐ, 9న మంగనూర్ ఎస్బీఐ, 12న జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంకు వారు ఇంటర్వ్యూ నిర్వహించనున్ననట్లు తెలిపారు. దరఖాస్తుదారులందరు తమ దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, ఆదాయం, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతాలకు చెందిన నకలు తీసుకుని ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ మాడల్ డిగ్రీ కళాశాలలో నూతన ప్రవేశాలకు దోస్త్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీపాద శార్వాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దోస్త్ ద్వారా కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఇవ్వాలని కోరారు.

తైబజార్ వేలంలో రూ.4.61లక్షల ఆదాయం

లింగాల: లింగాల మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించి మార్కెట్ తైబజార్ వేలం ద్వారా రూ.4.61 లక్షల ఆదాయం సమకూరింది. శనివారం పంచాయతీ ఆవరణలో ప్రత్యేకాధికారి అనిల్ సమక్షంలో వేలం నిర్వహించారు. ఇందులో 17 మంది పోటీ పడగా చాకలి తిప్పరాజు రవి అత్యధికంగా వేలం పాడి తైబజార్‌ను దక్కించుకున్నారు. పంచాయతీ నిబంధనల ప్రకారం వసూళ్లు చేయాలని ప్రత్యేకాధికారి సూచించారు. మే నెల 2025 నుంచి 2026 మార్చి చివరి నాటికి తైబజార్ వసూల్ చేసుకోవచ్చని ప్రత్యేకాధికారి తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రామకృష్ణ, ప్రజలు పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత



అచ్చంపేట రూరల్: మండలంలోని హాజీపూర్ చౌరస్తాలో శనివారం తెల్లవారుజామున నిషేధిత నల్లబెల్లాన్ని అక్రమంగా కారులో తరలిస్తుండగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఉదయం రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా ఇండిగో కారులో 16బస్తాల నల్లబెల్లం, 5 కిలోల పటిక, 6లీటర్ల నాటుసారా పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్ మూడావత్ శివపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శారద తెలిపారు. కేసును అచ్చంపేట ఎక్సైజ్ శాఖకు అప్పగించినట్లు తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు



అచ్చంపేట రూరల్: ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవని ఎంఆర్ఐ శివకుమార్, ఏఆర్ఐ బాల్‌రాం హెచ్చరించారు. శనివారం మండలంలోని నడింపల్లి శివారు సర్వేనెంబర్ 62లో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసకుంటామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ముగ్గురికి గాయాలు

తెలకపల్లి: ఆటోబోల్తా పడ్డ సంఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఉప్పునుంతల మండల పెద్దపూర్ గ్రామం నుంచి శనివారం మధ్యాహ్నం ప్రయాణికులతో ఆటో బయలుదేరింది. తెలకపల్లి సమీపంలోని శివగంగ ఫంక్షన్ హాలు దగ్గర అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో పెద్దాపూర్ గ్రామానికి చెందిన నిరంజన్, రాకొండ గ్రామానికి చెందిన మహేష్, రాయవరానికి చెందిన రాజేష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురిని 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పిడుగుపాటుకు కాడెద్దులు మృత్యువాత

అచ్చంపేట రూరల్: మండలంలోని కొర్రతాండలో శుక్రవారం అర్ధరాత్రి పిడుగుపాటుకు రెండు కాడెద్దులు మృత్యువాత పడ్డాయి తండాకు చెందిన కొర్ర శంకర్‌కు చెందిన కాడెద్దులను వ్యవసాయ పొలంలో చెట్టుకు కట్టేశాడు. శనివారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా ఎద్దులు మృత్యువాత పడ్డాయి. మాజీ ఎంపీపీ రామనాథం, తండావాసులు పరామర్శించారు.

భూసార పరీక్షలతోనే సరి!



- ఒకే మండలానికి పరిమితమైన సేకరణ
- ఏడాది గడిచినా మట్టి నమూనా ఫలితాలు రాలే..
- పెంట్లవెల్లి మండలంలో 1460 శాంపిళ్ల సేకరణ

నాగర్‌కర్నూల్: భూమిలో ఉన్న సారవంతాన్ని బట్టి రైతులు ఏ పంటలు వేయాలి, ఎలాంటి మందులు వాడాలి అనే విషయాలను రైతులకు తెలిపేందుకు ప్రభుత్వం భూసార పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. అయితే గతేడాది రైతులకు సంబంధించి మట్టి నమూనాలను సేకరించి వారికి సాయిల్ హెల్త్ కార్డు ఇచ్చేలా నిర్ణయించింది. దీని ద్వారా రైతుకు పంటలపై అవగాహన రావడంతో పాటు లాభసాటి వ్యవసాయం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇందు కోసం జిల్లాలో ఒక మండలాన్ని ఎంపిక చేసి మట్టి నమూనాలను సేకరించారు. ఇప్పటి వరకు మట్టి నమూనాలు సేకరించి రెండు సీజన్లు పూర్తయినా వాటి ఫలితాలు రైతులకు అందలేదు. దీంతో రైతులు పాత పద్ధతిలోనే తమకు నచ్చిన పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈనెల చివరి వరకు రైతులు పంట సాగుకు సంబంధించిన పనులు ప్రారంభించనున్నారు,

1460 శాంపిళ్ల సేకరణ..

జిల్లాలోని పెంట్లవెల్లి మండలాన్ని మట్టినమూనాల సేకరణకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ మండలంలోని ఆయా గ్రామాల్లో కలిపి మొత్తం 1460 నమూనాలను సేకరించారు. గ్రామాల వారీగా తీసుకుంటే కోడూర్‌లో 300, సింగవరంలో 145, గోపాలపురంలో 248, జటప్రోల్‌లో 197, పెంట్లవెల్లిలో 433, మంచాలకట్టలో 49, వేంకల్‌లో 43, మల్లేశ్వరంలో 35 శాంపిళ్లను సేకరించారు. గత ఖరీఫ్‌లో శాంపిళ్ల సేకరణ సమయంలో వర్షాలు కురవడం, ఇతరత్రా సమస్యల వల్ల పూర్తి స్థాయిలో శాంపిళ్లు సేకరించలేదు. దీంతో రబీలో మరి కొన్ని శాంపిళ్లను సేకరించి జడ్చర్లలో ఉన్న ల్యాబ్‌కు పంపించారు. ఇప్పటి వరకు ఫలితాలు మాత్రం రాలేదు. రైతులకు ఈ సమమయంలో ఫలితాలు వస్తేనే ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికే వ్యవసాయ అధికారులు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. మే మొదటి వారంలో రైతులు వ్యసాయ పనులు ప్రారంభించే అవకాశం ఉంది. అవగాహన లేకుండా విచ్చలవిడిగా రసాయనాలు వాడడం వల్ల భూసారం దెబ్బతింటుంది. పెంట్లవెల్లి మండల పరిస్థితి అలా ఉంటే జిల్లాలోని మిగతా మండలాల్లో కనీసం మట్టి నమూనాల సేకరణకు సంబంధించి ప్రతిపాదనలే లేకపోవడంతో రైతులు భూసార పరీక్షలపై ఆశలు వదులుకుంటున్నారు. మట్టి నమూ నాల సేకరణ ఒక ఎత్తయితే వాటిని జడ్చర్లకు తరలించేందుకు వ్యవసాయాధికారులకు పెద్ద ఖర్చుతో కూడుకున్న పనిగా మారింది. జిల్లా కేంద్రంలో భూ సార పరీక్షా కేంద్ర ఏర్పాటు చేయాలని డిమాండ్ వ స్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు.

గతేడాది మట్టి నమూనాలు తీసుకెళ్లారు..



వ్యవసాయ అధికారులు భూసార పరీక్షల కో సం నా పొలం నుంచి మట్టి నమూనాలను గతేడాది తీసుకెళ్లారు. కానీ ఇప్పటి వరకు దాని ఫలితాలు చెప్పలేదు. దీంతో మాకు నచ్చిన పంటలను సాగు చేసుకునేందుకు సిద్ధమవు తున్నాం. ఫలితాలను ప్రకటించి రైతులకు సలహాలు ఇస్తే బాగుంటుంది.

– ధనుంజయ్, రైతు, మంచాలకట్ట

లక్ష్యం మేరకు మట్టి నమూనాల సేకరణ



ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు పెంట్లవెల్లి మండలంలోని ఆయా గ్రామాల నుంచి మట్టి నమూనాలు సేకరించాం. సేకరించిన నమూనాలను జడ్చర్ల కేంద్రానికి పంపించాం. ఇప్పటికీ ఫలితాలు రాలేదు.

– చంద్రశేఖర్, డీఏఓ, నాగర్‌కర్నూల్

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: సీఎంఆర్ఎస్ నిధి పేదలకు వరంలాంటిదని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పోచమ్మతండాకు చెందిన వడ్యావత్ సుక్లికి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో దుబ్బతండా శ్రీనునాయక్, సురేందర్‌రెడ్డి, జగన్‌గౌడు, తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో కార్యాలయంలో తహసీల్దార్ విజయసింహ ఆదేశాల మేరకు సీనియర్ అసిస్టెంట్ ఉమాదేవి, గోపులాపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు, గోపాల్ కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఉమాదేవి, గోపాల్, ఆంజనేయులు, శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ఉత్సవాలు



భ్రమరాంబ ఆలయం వద్ద బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా కన్యాపూజ కార్యక్రమం

అచ్చంపేట: అచ్చంపేట పట్టణంలో బొడ్రాయి, పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం భ్రమరాంబ ఆలయం వద్ద ఉదయం 7గంటలకు యాగ మండప దేవతార్చనలు, ప్రధాన ప్రతిష్ఠా హోమాలతో మహామృత్యుంజయ, ఛండీ సహిత అష్టదిక్పాలక మాతృ దేవత ప్రధాన హోమాలు నిర్వహించారు. గ్రామ దిక్పాలక శక్తి స్వరూపమైన అమ్మవార్ల పీఠపూజ, గ్రామ బొడ్రాయి, పోచమ్మ తల్లి అమ్మవార్ల విగ్రహాలకు, యంత్రరాజములకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, నిర్వాహకులు సతీష్, చంద్రమోహన్, మండికారి బాలజీ, శ్రీధర్, కటకం రఘురాం, ఆకుల వెంకటేష్, యాదయ్య, భగీర్‌నాథ్, కోట కిశోర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు



పెంట్లవెల్లి: భూ భారతి చట్టంపై 2025 పైలెట్ ప్రాజెక్ట్ పెంట్లవెల్లి మండలం ఎంపిక చేశారు. అందులో భాగంగా భూ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణకు రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయసింహ తెలిపారు. అందులో భాగంగా 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పెంట్లవెల్లి మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. రోజు ఉదయం 8.30 గంటల నుంచి 5.30 గంటల వరకు గ్రామాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తారని, రైతులకు ఎలాంటి భూ సమస్యలున్నా దరఖాస్తు ఇవ్వాలని తహసీల్దార్ తెలిపారు.

జూనియర్ సివిల్ జడ్జిగా కల్వకుర్తి వాసి



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన బ్యాంగి కృష్ణతేజ ఇటీవల విడుదలైన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాలలో ఎంపికయ్యాడు. తెలంగాణ హైకోర్టు–2024లో నిర్వహించిన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జడ్జిగా ఎంపికయ్యాడు. పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న అమరేందర్ కుమారుడు కృష్ణతేజ వారి పెద్దనాన్న శ్రీనివాసులు రంగారెడ్డి జిల్లాలో న్యాయసేవాధికార సంస్థలో జడ్జిగా పనిచేస్తున్నారు. వారి సూచనలు, సలహాలతోనే ఈ విజయాన్ని సాధించినట్లు కృష్ణతేజ తెలిపాడు. పాఠశాల విద్య పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో, ఇంటర్మీడియట్ శ్రీచైతన్య కళాశాలలో, హైదరాబాద్‌లోని వెంకట సుబ్బయ్య న్యాయ కళాశాలలో 5 ఏళ్ల లా ఇంటిగ్రేటెడ్ కోర్సు, ఉస్మానియా న్యాయ కళాశాలలో ఎల్‌ఎల్‌ఎమ్ కోర్సును పూర్తిచేసినట్లు తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన కృష్ణతేజను తల్లిదండ్రులు, కాలనీవాసులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

సమ్మర్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ లక్ష్మణ్

సాక్షి, నెట్‌వర్క్: సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా వారి తల్లిదండ్రులు చేయాలని కల్వకుర్తి బాలోత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ లక్ష్మణ్ కోరారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ భవనంలో సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో క్యాంపులో బోధన చేస్తారన్నారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఆటలు, పాటలు, పద్యాలు, మ్యాజిక్ షోలు ఉంటాయన్నారు. కల్వకుర్తిలోని విద్యాభిమానులు ప్రతి ఒక్కరు సెలవు దినాలలో తమ పిల్లలు అర్థవంతమైన, ఆరోగ్యకరమైన, విజ్ఞాన దాయకంగా ఉండే పాఠ్యాంశాలతో పాటు జీవితకాలం పనికొచ్చే జీవిత పాటలు సమ్మర్ క్యాంపులో నేర్చుకోవచ్చని లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో బాలోత్సవ్ కమిటీ చైర్మన్ చెన్నయ్య, కో చైర్మన్ వెంకటయ్య, పద్మ, పాండయ్య, పవన్, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, మల్లయ్య, నెహ్రూ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

- నాగర్‌కర్నూల్ మండలంలో ఈ నెల 5 నుంచి 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వేసవి శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి భాస్కర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.
- కల్వకుర్తి మండలంలోని మార్చాలా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి వెంకటరమణ శనివారం ప్రకటనలో తెలిపారు. మొదట రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.
- చారకొండలో విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి ఝాన్సీరాణి తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, జూపల్లి జెడ్పీ హైస్కూల్‌లో సమ్మర్ క్యాంపు శిక్షణ శిబిరం ఈనెల 5 నుంచి 15 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
- తెలకపల్లిలో సోమవారం నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు.
- వెల్దండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో వేసవి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రుడు పేర్కొన్నారు.

హిందూ శ్మశాన వాటికలు అభివృద్ధి చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కల్వకుర్తి రూరల్: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న హిందూ శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని బీజేపీ నాయకులు శనివారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ షేక్ మహమూద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలలో నెలకొన్న సమస్యలు, మౌలిక సదుపాయాలను ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ దీపాలు, నీళ్లు, దుస్తులు మార్చుకునే గదులు, కాటికాపర్లు లేకపోవడంతో పాటు ఆ ప్రాంతమంతా కంపచెట్లు చెత్తాచెదారంతో నిండిపోయినట్లు తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా 10 ఎకరాల స్థలం హిందూ శ్మశాన వాటికకు కేటాయించి, అందులో అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, రాంభూపాల్ రెడ్డి, నరేడ్ల శేఖర్ రెడ్డి, బోడ నరసింహ, బాబీదేవ్, తదితరులు పాల్గొన్నారు.

16వ సారి పీఆర్వోగా పాషా

కల్వకుర్తి రూరల్: లయన్స్‌క్లబ్ ఆమనగల్ ప్రచార కార్యదర్శిగా పాషా మరోసారి ఎన్నికయ్యారు. 2009–10 నుంచి ఇప్పటి వరకు ప్రతిసారి ఆయననే క్లబ్ సభ్యులు ప్రచార కార్యదర్శిగా ఎన్నుకుంటున్నారు. క్లబ్ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారంలోకి తీసుకెళ్లడంతో పాటు సభ్యులను సమన్వయం చేస్తూ క్లబ్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధ్యక్షుడిగా ఎవరున్నా ప్రచార కార్యదర్శిగా ఆయననే ఎన్నుకుంటున్నారు. శనివారం పాషా విలేకరులతో మాట్లాడుతూ నా సేవలకు గుర్తింపు ఇవ్వడంతో పాటు గవర్నర్లు చిన్న కిషన్ రెడ్డి, సందడి నరేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, డాక్టర్ దామోదర్‌రెడ్డి, జూలూరు రమేష్ బాబు తదితరుల సహకారం ఉందన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన క్లబ్ ముఖ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

అంగన్‌వాడీలకు బీఎల్‌ఓ డ్యూటీలు రద్దు చేయాలి



ఆర్డీఓకి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

కల్వకుర్తి రూరల్: అంగన్‌వాడీ ఉద్యోగులకు ఎన్నికలకు సంబంధించిన బీఎల్‌ఓ డ్యూటీలు, ఇతర సర్వేలు వేయకుండా చూడాలని అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు కమిటీ కార్యదర్శి జయమ్మ అన్నారు. శనివారం సమస్యలపై ఆర్డీఓ శ్రీను నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. మే నెలలో అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు సెలవు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఐసీడీఎస్ స్కీం పరిధిలోకి రాని పనులు చేయకూడదని సర్క్యులర్‌లో ఉందన్నారు. కార్యక్రమంలో నిర్మలమ్మ, పద్మ, జ్యోతి, సునీత సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి



వాటర్‌మెన్‌లతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్, ఏఈ

కల్వకుర్తి టౌన్: పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో వాటర్ మెన్‌లు, కిందిస్థాయి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వేసవిలో తాగునీటి సమస్య అధికంగా ఉంటుందని, మంచినీటిని వృథా కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ ఏఈ షబ్బీర్, వాటర్‌మెన్‌లు పాల్గొన్నారు.

పందులను పట్టణానికి దూరంగా ఉంచాలి

పందుల పెంపకదారులు వారి పందులను పట్టణానికి దూరంగా ఉంచాలని కమిషనర్ వారిని హెచ్చరించారు. పట్టణంలోకి పందులు రాకుండా, ఇబ్బందులు కలగకుండా చూడాలని వారికి ఆదేశాలిచ్చా రు. అనంతరం వారికి పలు సూచనలు చేశారు. స మావేశంలో మేనేజర్ రాజకుమారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగన్న, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శివ, పందుల యజమానులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని లక్ష్మణచారి భవన్‌లో శనివారం ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బీజ్జా శ్రీనివాస్ సంఘం జెండాను ఎగరవేశారు. దేశంలోనే మొట్టమొదటి యువజన సమాఖ్య ఏర్పడి యువకుల హక్కులకోసం ఉద్యమిస్తోందన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి యువతీ యువకులు ఓటు హక్కును సాధించిన ఘనత ఏఐవైఎఫ్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి నాయకులు కేశవులుగౌడ్, నాయకులు ఉమ్మడి జిల్లా మాజీ జిల్లా అధ్యక్షులు ఈర్ల భూపేష్ బాబు పాల్గొన్నారు.

ముప్పిపల్లిలో ప్రత్యేక పూజలు



పెద్దకొత్తపల్లి: ముప్పిపల్లిలో ఉన్న ఆంజనేయస్వామి, చెన్నకేశవాలయం, శివాలయంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థి గాజుల వినయ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గణేష్‌రావు,శివ, రాజు, రాముడు లక్ష్మయ్య పాల్గొన్నారు.

లింగసానిపల్లిలో ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ



టీకాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటరాములు

కల్వకుర్తి రూరల్: మండలంలోని లింగసాని పల్లి గ్రామపంచాయతీని ఎంపీడీఓ వెంకటరాములు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు, తాగునీరు సరఫరా, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆశా కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు, ఏడాది లోపు చిన్నారులకు ఇచ్చే టీకాలు, ఇమ్యునైజేషన్ విధానాన్ని పరిశీలించి బాలింతలతో మాట్లాడి ఎంపీడీఓ వెంకటరాములు సంతృప్తి వ్యక్తం చేశారు.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కొల్లాపూర్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ హక్కుల పోరాట సమితి నాయకులు రాంచందర్‌నాయుడు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార సమయంలో చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తి అవుతున్నా బోయల గూర్చి సీఎం మాట్లాడటం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే దిశగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. లేనిపక్షంలో బోయలను సంఘటితం చేసి ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు కురుమయ్య, శ్రీనివాసులు, రఘు ఉన్నారు.

ఆర్డీఓకు వినతి

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల గ్రామ శివారులో 182 సర్వే నెం.182లో బ్లాక్ గ్రానేట్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని గ్రానేట్ తవ్వకాలకు వ్యతిరేకంగా గ్రామస్తులు, రైతులు శనివారం కల్వకుర్తి ఆర్డీఓ శ్రీనుకు, కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. గ్రామంలో గ్రానేట్ తవ్వకాలో జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు, వివిధ పార్టీల నాయకులు శ్రీను, తిరుమల్లేష్, సురేష్, మాజీ సర్పంచ్ పసుల శ్రీను, విజయ్, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నమూనా పరిశీలించిన పీడీ



కోడేరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అల్యూమినియం ఫార్మా వర్క్ టెక్నాలజీతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల నమూనాలను పీడీ సింగప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు ఇదే పద్ధతిలో కట్టుకోవాలన్నారు. ఇంటి నిర్మాణం 15 రోజుల్లో పూర్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్, ఏఈ రాజవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులను అరెస్టు చేయాలి

కొల్లాపూర్ రూరల్: సిద్దిపేట జిల్లా ఎల్లదాసు గూడెం, చేర్యాల మండలంలోని వేచరేని గ్రామాలలో బుడగ సంఘాల కాలనీలో ఉన్న ఆంజనేయ స్వామి గుడిలోకి వెళ్లడాన్ని దళితుడైన అజయ్‌ని అక్కడున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు అకారణంగా కొట్టి చిత్ర హింసలకు గురి చేశారని, వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిని శిక్షించాలని దళిత దండు రాష్ట్ర అధ్యక్షులు బచ్చలకూర బాల్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన రామాపురంలో దళిత దండు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభుది అజయ్, తల్లి లక్ష్మమ్మలకు ఇద్దరికి మతిస్థిమితం లేదన్నారు. వారికి ఉండడానికి ఇల్లు కూడా లేదన్నారు. వారు ఆంజనేయ స్వామి గుడిలోకి వెళ్లారని వారిని బీజేపీ నాయకులు అకారణంగా దాడులు చేసి కులంపేరుతో దూషించడం జరిగిందన్నారు. దాడులు చేసిన వారిని గుర్తించి వారిని శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బుడగ జంగాల జాతీయ అధ్యక్షులు కోడిగంటి నరసింహ, నాయకులు వెంకటేష్, నరసింహ, రవి, తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ లబ్ధిదారుల పరిశీలన



వెల్దండ: అర్హులైన వారందరికి ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. శనివారం మండల కేంద్రంలో ఇంటింట సర్వే చేపట్టి అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వర్ జీ, కార్యదర్శి గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటికి దారి కల్పించాలి

వెల్దండ: మండలంలోని పోతేపల్లి గ్రామంలో తర్నికంటి అంజయ్య ఇంటికి దారి కల్పించాలని కోరూతు శనివారం ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఇంట్లో పిల్లలు, వృద్ధులతో కలిసి 9మంది నివాసం ఉంటున్నట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శి తమ ఇంటిచుట్టు పెద్దబండరాళ్లు వేయడంతో అంగవైల్యంగా ఉన్న తమకు ఇంటికి వెళ్లడానికి దారిలేకుండా పోయిందన్నారు. అనేక సార్లు కార్యదర్శు దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే పూర్తి విచారణ చేసి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. అనంతరం వినతి పత్రం అందజేశారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

లింగాల: అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ పథకంలో ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి అనిల్ అన్నారు. మండలంలోని సూరాపూర్, కొత్తకుంటపల్లిలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సర్వే పనులు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ యాదవ్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతాం

కందనూలు: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతామని నాగర్‌కర్నూల్ బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా బీజేపీ కార్యాలయంలో నూతనంగా మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ప్రమోద్‌కుమార్, నాగర్‌కర్నూల్ రూరల్ అధ్యక్షుడిగా నోమేశ్వర్‌రెడ్డి ఎన్నికైన సందర్భంగా వారు మాట్లాడారు. రాబోయే మున్సిపాలిటీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని, రాష్ట్రంలో రాబోయేది నరేంద్రమోదీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.